జన చేతనం

- కాంగ్రెసేతర పార్టీలకు మాడుగుల పట్టం
- చట్టసభల్లో సత్తా చాటిన మహిళలు
- ప్రచారంపై ఎండ ప్రతాపం! ·7లో

విజయీభవ సందడి

కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఘన స్వాగతం

- అడుగడుగునా నీరాజనం
- కూటమి శ్రేణులతో కిక్కిరిసిన రహదారులు



విజయీభవ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు

కొత్తూరు, ఏప్రిల్ 24:

అనకాపల్లి పట్టణంలో బుధవారం సాయంత్రం సందడి నెలకొంది. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయీభవ ర్యాలీలో కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొనడంతో ఆయనకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నేల వేషాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల ప్రదర్శనలతో అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ ర్యాలీ సాయంత్రం ఆరు గంటలకు అనకాపల్లి పట్టణంలోని సుంకరమెట్ట వద్ద ప్రారంభమై రింగురోడ్డు, చిననాలుగురోడ్ల కూడలి మీదుగా నెహ్రూచౌక్ కూడలికి చేరుకుంది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.

మోదీ ఆశీస్సులతో ముందడుగు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతోనే కూటమి ముందడుగు వేస్తోందని బీజేపీ అనకాపల్లి అభ్యర్థి సీఎం రమేశ్ తెలిపారు. విజయీభవ ర్యాలీలో భాగంగా నెహ్రూచౌక్ కూడలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కేంద్రంలో మోదీ ఆశీస్సులు, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఆశీస్సులు ఉన్నంత వరకూ రాష్ట్రం అభివృద్ధి చెందుతూనే ఉంటుందని తెలిపారు. అనకాపల్లి అభివృద్ధికి డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. డబుల్ ఇంజన్ అంటే అభివృద్ధి, సంక్షేమం ... మిగతా 8వ పేజీలో



కార్యక్రమానికి హాజరైన కూటమి నాయకులు, కార్యకర్తలు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి

- బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 24:

కూటమి ప్రభుత్వంతోనే అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి సాధ్యమని కూటమి బలపరిచిన బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి తన నామినేషన్ అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్‌ను ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే నెల మూడు లేదా నాలుగు తేదీల్లో ప్రధానమంత్రి మోదీ అనకాపల్లికి వస్తున్నారని, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను మోదీకి వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరతానన్నారు. రాష్ట్రంలోని పోలీసులు కరుడు కట్టిన వైసీపీ నాయకుల్లా వ్యవహరిస్తున్నారని, ఈ పద్ధతి సరైనది కాదన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వైసీపీ పాలన చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యాయించుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, రాష్ట్రం మళ్లీ అభివృద్ధిపథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఇందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపిస్తే పారిశ్రామికంగా అనకాపల్లి ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే శక్తి, సామర్థ్యాలు సీఎం రమేశ్‌కు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు

పార్లమెంట్ స్థానానికి 15..

అసెంబ్లీ స్థానాలకు 24 దాఖలు

- నేటితో ముగియనున్న గడువు



జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్. పక్కన అయ్యన్నపాత్రుడు, దాడి వీరభద్రరావు, అనిత, బత్తుల తాతయ్యబాబు ఉన్నారు

అనకాపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో నామినేషన్ల జోరు కొనసాగుతోంది. బుధవారం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 15 నామినేషన్లు, అసెంబ్లీ స్థానాలకు 24 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల గడువు గురువారంతో ముగియనుంది. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ తరఫున గరా సూర్యారావు, ఇదే పార్టీ నుంచి వేగి వెంకటేశ్, స్వతంత్ర అభ్యర్థిగా తుంపాల హరిశంకర్, దళిత బహుజన పార్టీ తరఫున కృష్ణస్వరూప్ వడ్లమూరి, వైసీపీ తరఫున బీశెట్టి వెంకట సత్యవతి, ఇదే పార్టీ తరఫున బూడి ముత్యాలనాయుడు కూడా నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే బహుజన సమాజ్‌పార్టీ తరఫున పలకా శ్రీరామ్మూర్తి, భారత చైతన్య యువజన పార్టీ తరఫున నమ్మి అప్పలరాజు నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ స్థానాలకు..

అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా కె.సత్యనారాయణ, వైసీపీ తరఫున మలసాల భరత్‌కుమార్, అదే పార్టీ తరఫున నివేదిత గంగుపాం, జనసేన పార్టీ తరఫున కొణతాల రామకృష్ణ అదనపు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎలమంచిలి అసెంబ్లీ స్థానానికి లంబా శ్రీనివాసరావు(బీఎస్‌పీ), డి.పూర్ణచంద్రరావు(జై భారత్ నేషనల్ పార్టీ), ప్రగడ అన్నపూర్ణ(టీడీపీ), మేరుగు రాజుబాబు(స్వతంత్ర), సుందరపు విజయ్‌కుమార్ జనసేన పార్టీ తరఫున రెండు సెట్లు, యు.సుకుమారవర్మ(వైసీపీ) నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. మాడుగుల అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరఫున బండారు సత్యనారాయణమూర్తి సతీమణి మాధవీలత డమ్మీ నామినేషన్ వేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా మళ్ల ఆరినాయుడు, బూడి రవికుమార్, మళ్లరపు లోవ, పైలా ప్రసాదరావు నామినేషన్లు దాఖలు చేశారు. పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి దళిత బహుజన పార్టీ తరఫున వడ్లమూరి కృష్ణ స్వరూప్, కాంగ్రెస్ తరఫున బోని తాతారావు, స్వతంత్ర అభ్యర్థిగా మారుతి నారాయణ చక్రవర్తి నామినేషన్లు దాఖలు చేశారు. నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ తరఫున రుత్తల శ్రీరామ్మూర్తి, బీఎస్‌పీ తరఫున బొట్ట నాగరాజు, వైసీపీ తరఫున పెట్ల కళావతి తమ నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్లు అందజేశారు. కాగా పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో శేష శైలజకు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు నామినేషన్ పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గండి బాబ్జీ, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు బీజేపీ ఇన్‌చార్జి సీఎం శ్రీనివాసులనాయుడు పంచకర్ల అభ్యర్థిత్వాన్ని బలపరిచారు.



పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో శేష శైలజకు నామినేషన్ పత్రం అందజేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, పక్కన బండారు, పీలా, బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాసులునాయుడు ఉన్నారు

అద్దె కార్యకర్తలు

రాజకీయ కూలీలకు డిమాండ్



- రోడ్‌షోలు, సభలు, ప్రచారం, ర్యాలీలు...
- కార్యక్రమం ఏదైనా జెండాలు మోసేది ఎక్కువగా వారే
- ఇప్పటివరకూ రూ.300 చొప్పున ఇస్తున్న నేతలు
- ఒకటి, రెండు నియోజక వర్గాల్లో రూ.వెయ్యి...
- ఇప్పుడు తమకూ అంతే మొత్తం ఇవ్వాలని డిమాండ్
- మరో గత్యంతరం లేక రూ.500 చొప్పున ఇవ్వడానికి పలువురు అభ్యర్థుల సమ్మతి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో పనుల్లేక ఇబ్బంది పడుతున్న నిరుపేదలు, దినసరి కూలీలు ఎన్నికల పుణ్యమా అని నాలుగు మెతుకులు తినగలుగుతున్నారు. రాజకీయ పార్టీల ర్యాలీలు, ఊరేగింపులకు స్వచ్ఛందంగా వచ్చేవారు చాలా తక్కువగా ఉంటారు. దీంతో డబ్బులిచ్చి జనాలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి నేతలకు ఏర్పడింది. అయితే పోలింగ్ సమీపిస్తుండడంతో రాజకీయ కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇప్పటివరకూ భోజనం పెట్టి ఒక మనిషికి రూ.300 చొప్పున ఇవ్వగా, ఇప్పుడు తమ కూలీ రేటు పెంచితేగానీ రాలేమని అంటుండడంతో నేతలు తలలు పట్టుకుంటున్నారు.

పోలింగ్‌కు మరో 18 రోజులే గడువు ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని తమ బల ప్రదర్శనకు ఉపయోగించుకుంటున్నారు. మరోవైపు తమ తమ పార్టీల పెద్దల సభలు, రోడ్‌షోలు జరుగుతుండడంతో వాటికి కూడా జనాలను తరలించాల్సిన పరిస్థితి. ఇంకొకవైపు ప్రతీరోజూ వార్డుల్లో నిర్వహించే ప్రచారం/సభలకు కూడా జనాలు అవసరం. కానీ రాజకీయ పార్టీల కార్యక్రమాలకు జనాలు స్వచ్ఛందంగా వచ్చే పరిస్థితి లేకపోవడంతో డబ్బులిచ్చి జనాలను తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వార్డు స్థాయిలో తమ పార్టీ నేతల ద్వారా స్థానికంగా ఉండే కాలనీలు, భవన నిర్మాణ కూలీలు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లి జనాలను తెచ్చుకుంటున్నారు. ఒక గంటపాటు జెండా పట్టుకుని నిలబడడమో, సభకు హాజరై కూర్చుని వెళ్లిపోవడమో అయితే మనిషికి రూ.200 ఇచ్చేలా ఒప్పందం చేసుకుంటున్నారు. అదే ఉదయం నుంచి ... మిగతా 8వ పేజీలో

ఈదురుగాలుల బీభత్సం

మాడుగులలో నేలకొరిగిన చెట్లు

- దేవరాపల్లిలో నేలమట్టమైన అరటి తోటలు
- కూలిపోయిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

మాడుగుల/మాడుగుల రూరల్, ఏప్రిల్ 24:

నియోజకవర్గంలో పలు చోట్ల బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. అయితే మధ్యాహ్నం మూడు గంటల నుంచి వాతావరణం మారిపోయింది. ఆ తరువాత ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది.

దీంతో మాడుగుల దొరలవీధిలో భారీ చింతచెట్టు నేలకొరిగింది. కోడూరు, ఘాట్ రోడ్డు మార్గాల్లో చెట్ల కొమ్మలు ... మిగతా 8వ పేజీలో



ఈదురు గాలులకు మాడుగుల దొరలవీధిలో నెలకొరిగిన భారీ చింతచెట్టు



దేవరాపల్లి మండలం నాగయ్యపేటలో నేలమట్టమైన అరటి తోట

మధ్యాహ్నం వరకు మండిన ఎండలు

- రావికమతంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- వడగాడ్పులకు జనం విలవిల

అనకాపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. బుధవారం అత్యధికంగా రావికమతంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గొలుగొండలో 44, రోలుగుంటలో 43.3, నర్సీపట్నంలో 42.8, కోటవురట్లలో 42.5, చీడికాడ, చోడవరంలో 42.4, కశింకోట, మాకవరపాలెం, నాతవరంలో 42.3, మాడుగులలో 42.1, అనకాపల్లిలో 42, కె.కోటపాడులో 41.6, బుచ్చెయ్యపేటలో 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.

రెండో రోజూ అదే నిరీక్షణ

- బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు ·6లో

ఇసుక తోడేళ్లు

నదీ పరీవాహక ప్రాంతాల్లో దర్జాగా అనధికార తవ్వకాలు

- వైసీపీ నేతల ప్రమేయం ఉండడంతో పట్టించుకోని అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో దర్జాగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇందులో వైసీపీ నాయకుల ప్రమేయం ఉండడంతో రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



గొలుగొండ మండలంలో టైరు బండ్లలో తరలిస్తున్న ఇసుక



అనకాపల్లి మండలం కొప్పాక వద్ద జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఓ లేఅవుట్‌లో నిల్వ చేసిన ఇసుక

జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.4 వేలు నుంచి దూరాన్ని బట్టి రూ.6 వేలు వరకు ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. టైరు బండి ఇసుక అయితే రూ.1500కి అమ్ముతున్నారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో నదుల్లో ఇసుకను రేయింబవళ్లు తవ్వి ట్రాక్టర్లు, టైరు బండ్లలో తరలిస్తున్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఇసుకను నిల్వ చేసి విక్రయిస్తున్నారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల మండలాల్లో కొంతమంది స్థానిక వైసీపీ చోటా నాయకులు సొంతంగా పదుల సంఖ్యలో టైర్ బండ్లను ఇసుక రవాణా కోసం వినియోగిస్తున్నారు. వీరికి వైసీపీ పెద్దల అండదండలు ఉండడంతో రెవెన్యూ, గనులశాఖల అధికారులు, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

విజయీభవ



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రమేశ్, అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణ మూర్తి, కొణతాల రామకృష్ణలకు గజమాలతో సత్కరించిన వైనం

అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ వేసిన అనంతరం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను గజమాలతో సత్కరించారు. అలాగే కమలం గుర్తును చూపించి ఓటు వేయాలని కేంద్ర మంత్రి అభ్యర్థించారు.



కమలం గుర్తును చూపిస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సీఎం రమేశ్, తదితరులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న సీఎం రమేశ్ కుటుంబసభ్యులు

నూకాంబికను దర్శించుకున్న సీఎం రమేశ్ కుటుంబసభ్యులు



సీఎం రమేశ్ దంపతులను గజమాలతో సత్కరించిన దాడి రత్నాకర్, జయవీర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 24: స్థానిక నూకాంబిక అమ్మవారిని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు బయలుదేరిన ఆయన కుటుంబసభ్యులతో ఆలయానికి రావడంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, జయవీర్‌స్వాగతం పలికారు. నూకాంబిక అమ్మవారిని వారు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ దంపతులకు శాలువ కప్పి రత్నాకర్, జయవీర్ ఘనంగా సన్మానించారు. అలాగే గజమాలతో సీఎం రమేశ్ దంపతులను సత్కరించారు. అలాగే పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని కూడా సీఎం రమేశ్ కుటుంబసభ్యులు దర్శించుకున్నారు.

ఇద్దరు వలంటీర్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 24 : ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించి వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న మండలానికి చెందిన ఇద్దరు వలంటీర్లను అధికారులు బుధవారం విధుల నుంచి తొలగించారు. విశాఖలో మంగళవారం సీఎం జగన్‌తో జరిగిన సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో కొత్త రేవుపోలవరం, ఉప్పరాపల్లి సచివాలయాలకు చెందిన వలంటీర్లు చేపల రాజు, నానేపల్లి అప్పలరాజు పాల్గొన్న అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఎంపీడీఓ సత్యనారాయణమూర్తి ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించిన ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు ప్రకటించారు.

ధర్మశ్రీ ఆస్తుల విలువ రూ.10.69 కోట్లు

- అఫిడవిట్‌లో స్పష్టీకరణ
- బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు

చోడవరం, ఏప్రిల్ 24 : చోడవరం అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కరణం ధర్మశ్రీ అధికారులకు తన అఫిడవిట్‌ను బుధవారం దాఖలు చేశారు. ఇందులో ఆయన స్థిర, చరాస్థులు రూ.10.69 కోట్లుగా పేర్కొన్నారు. ధర్మశ్రీ తన వద్ద రూ. ఐదు లక్షల నగదు, భార్య వద్ద రూ.మూడు లక్షలు ఉన్నట్టుగా చూపారు. బ్యాంకులో డిపాజిట్ల రూపంలో రూ.5.15 లక్షలు, తన పేరుతో రూ.15 లక్షల విలువైన వాహనం ఉన్నట్టుగా పేర్కొన్నారు. అలాగే, మూడు వందల గ్రాముల బంగారం, తన భార్య పేరుమీద 11వందల గ్రాముల బంగారం ఉన్నదని వివరించారు.

ధర్మశ్రీ తన పేరుమీద స్థిర, చరాస్తులు కలిపి సుమారుగా రూ.2.56 కోట్లు, తన భార్య పేరుమీద రూ.6.23 కోట్లు, కుమారుడి పేరుమీద రూ.కోటి 90లక్షల విలువైన ఆస్థులు ఉన్నట్టు తెలిపారు. తన పేరుమీద మాడుగుల మండలం కేజేపురంలో ఐదు ఎకరాల 55సెంట్లు, తన భార్య పేరుమీద 50సెంట్లు, ఆనందపురంలో భార్య పేరుమీద ఎకరా 71సెంట్లు ఉన్నట్టుగా స్పష్టం చేశారు. భార్య పేరుమీద రూ.96.46 లక్షల రుణం ఉన్నట్టుగా చూపారు. ఇదిలావుంటే, ధర్మశ్రీపై బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2019 ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్టుగా కేసు నమోదైంది. బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరాంపురంలో పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ఓటర్లను ప్రలోభపెడుతున్న సందర్భంగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో జరిగిన పరిణామాల నేపథ్యంలో ధర్మశ్రీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండో రోజూ అదే నిరీక్షణ

బస్సుల కోసం ప్రయాణికులు పాట్లు

- సీఎం సభకు తరలిన 50 బస్సులు
- జోలాపుట్‌కు ఉన్న ఒక్క బస్సు రద్దుతో పాసింజర్లు అసహనం
- రెండు రోజులు అనకాపల్లి డిపోకు రూ.7 లక్షలు నష్టం



అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 24: పట్టణంలోని పీటీడీ కాంప్లెక్స్‌లో రెండో రోజు బుధవారం కూడా ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. మంగళవారం విజయనగరంలో సీఎం సభకు 50 బస్సులు పంపగా.. బుధవారం శ్రీకాకుళంలో సీఎం సభకు 50 బస్సులను పంపినట్టు డిపో వర్గాలు తెలిపాయి. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడకతప్పలేదు. విశాఖపట్నం, విజయనగరం, పలాస, రావికమతం, చోడవరం, పాడేరు, జోలాపుట్ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జోలాపుట్ బస్సును ఏకంగా నిలిపివేయడంతో ఆ ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అంతేకాకుండా బస్సుల కోసం పిల్లలతో గంటల కొద్ది నిరీక్షించిన ప్రయాణికుల కష్టాలు వర్ణణాతీతం. ఒకపక్క పెరిగిన ఉష్ణోగ్రతలు.. మరోపక్క ఉక్కపోతతో ప్రయాణికులు బస్సుల కోసం కాంప్లెక్స్‌లోనే వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. బస్సులను సీఎం సభకు పంపడం వల్ల రోజుకి రూ.మూడు నుంచి మూడున్నర లక్షల ఆదాయం తగ్గింది. బస్సులను తీసుకున్నందుకు గాను వైసీపీ గాని, అక్కడ పార్టీ అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు డబ్బులు చెల్లిస్తారో.. చెల్లించరో తెలియదు గాని ఈ రెండు రోజులు అనకాపల్లి డిపోకు సుమారు రూ.ఏడు లక్షల వరకు ఆదాయం తగ్గింది. బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులు ఎదురుచూపులు తప్పలేదు.

పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

తుమ్మపాల, ఏప్రిల్ 24: పంచాయతీరాజ్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. బుధవారం మాకవరంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పంచాయతీలు, మండల పరిషత్‌లు, జడ్పీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు నిధులు, విధులు, నియామకాలు లేక ఉత్సవ విగ్రహాలను తలపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సైతం జగన్మోహన్‌రెడ్డి వేరే పథకాలకు మళ్లిస్తున్నాయన్నారు. సర్పంచుల సమస్యలను ముఖ్యమంత్రికి ఎన్నిసార్లు విన్నవించినా కనీసం స్పందించలేదన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పలు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండడం దారుణమన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కాలం చెల్లే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెయ్యా నూకరాజు, కనుబుడ్డి నరసింగరావు, కొలగాని రమణ పాల్గొన్నారు.

కొన..సాగుతున్న రోడ్ల విస్తరణ పనులు

- తొమ్మిది నెలలైనా సగం కూడా పూర్తి కాని స్టేషన్ రోడ్డు పనులు
- టీడీఆర్‌ల ఇవ్వడంలో జాప్యం చేస్తున్న జీవీఎంసీ అధికారులు
- విస్తరణ ప్రారంభానికి నోచుకోని నూకాంబిక ఆలయ మార్గం



అనకాపల్లిలో ఆగిన రోడ్డు విస్తరణ పనులు



విస్తరణకు నోచుకోని నూకాంబిక ఆలయం రోడ్డు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 24 : పట్టణంలోని రోడ్ల విస్తరణ పనులు కొన.. సాగుతున్నాయి. తొమ్మిది నెలల క్రితం ప్రారంభమైన స్టేషన్ రోడ్డు పనులు సగం కూడా పూర్తి కాలేదు. ఆగస్టు నెలలో వినాయక చవితి నుంచి నూకాంబిక ఆలయ మార్గం విస్తరణ పనులు ప్రారంభిస్తామని గొప్పగా చెప్పిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నేటి వరకు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టలేదు. స్టేషన్‌రోడ్డు, పెరుగుబజార్‌రోడ్డు నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు విస్తరణ పనులను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గతేడాది జూలై 10వ తేదీన ప్రారంభించారు. కిలోమీటరు పొడవున ఉన్న ఈ మార్గాన్ని 50 అడుగులకు విస్తరించే పనులు చేపట్టారు. వాస్తవానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చింతావారివీధి విస్తరణతోపాటు స్టేషన్‌రోడ్డు విస్తరణ పనులకు కూడా చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఇల్లు, వ్యాపార సంస్థల యాజమాన్యాలతో కూడా మాట్లాడడంతో విస్తరణకు అందరూ ముందుకు వచ్చారు. అయితే కొద్దిరోజులకే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. గతేడాది ఆరంభంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. దీంట్లో భాగంగా గతేడాది జూలై 10వ తేదీన ప్రారంభమైన పనులు నేటికి తొమ్మిది నెలలు గడిచినా ఇంకా కొనసాగుతుండడం విశేషం. ఈ మార్గం అత్యధిక రద్దీ కలిగి ఉంటుంది. ప్రధాన వాణిజ్య సముదాయాలు, సినిమాహాలు, ఆలయాలు ఉన్నాయి. దీనికితోడు గవరపాలెం, పరవాడ ప్రాంతాల వాసులు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. ఇంతటి ప్రాధాన్యత గల ఉన్న ప్రాంతంలో విస్తరణ పనులను వేగవంతంగా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు భవనాలు తొలగించే సమయంలో మట్టిని కూడా పలుచోట్ల తొలగించకపోవడం వల్ల వాహనచోదకులు రాకపోకలు సాగించేటప్పుడు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారు 139 మంది ఉండగా.. వారిలో 59 మందికి మాత్రమే జీవీఎంసీ అధికారులు పరిహారం రూపంగా టీడీఆర్‌లు అందజేశారు. మరో మూడు భవనాల అంశం కోర్టులో ఉన్నాయి. మరో 87 మందికి టీడీఆర్‌లు నేటికీ ఇవ్వకపోవడం విశేషం.

పనులు ప్రారంభం కానున్న నూకాంబిక ఆలయ మార్గం

నూకాంబిక అమ్మవారి ఆలయ రోడ్డు విస్తరణ పనులు అధికారులు నేటికి ప్రారంభించలేదు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని ఆగస్టులో టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకటించారు. వినాయక చవితి నుంచి విస్తరణ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. జాతీయ రహదారిలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వారం నుంచి సంతబయలు, రజకకాలనీ, నూకాంబిక ఆలయం, పూల్‌బాగ్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డుకు 2.4 కిలోమీటర్ల పొడవున విస్తరణలో భాగంగా మార్కింగ్‌లను కూడా ఇచ్చారు. ఈ రోడ్డును 66 అడుగులకు విస్తరింపజేసి డబుల్ రోడ్డుగా నిర్మించాలని అధికారులు ప్రణాళిక తయారుచేశారు. అయితే స్టేషన్‌రోడ్డు 50 అడుగులకు విస్తరిస్తున్నప్పుడు తమ మార్గం కూడా 50 అడుగులకే విస్తరించాలని భవనాలు కోల్పోతున్న వారు డిమాండ్ చేస్తున్నట్టు అధికారులే చెబుతున్నారు. ఈ కారణంగానే విస్తరణ పనులు కూడా ప్రారంభానికి నోచుకోలేదని తెలుస్తోంది. అయితే ఈ మార్గాన్ని వుడాగా ఉన్నప్పుడు రూ. ఏడున్నర కోట్లతో విస్తరించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అప్పట్లోనే ఎమ్మెల్యేగా ఉన్న పీలా గోవింద సత్యనారాయణ విస్తరణ పనులకు శ్రీకారం కూడా చుట్టారు. అయితే వుడా పనులు చేపట్టకపోవడంతో గతేడాది జీవీఎంసీ విస్తరణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డు పొడవునా మార్కింగ్ కూడా చేశారు. అయితే నేటి వరకు విస్తరణ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు.

స్టేషన్‌రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తాం

టౌన్‌ప్లానింగ్ అధికారి జనార్దన్

రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్టేషన్ రోడ్డులో 59 మందికి టీడీఆర్‌లు ఇచ్చాం. మరో 81 మంది దరఖాస్తులు చేయగా.. 56 మందికి ప్రాసెస్ చేశాం. ఇంజినీరింగ్ అధికారులు వారం రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. నూకాంబిక ఆలయ రోడ్డు విస్తరణ మాస్టర్ ప్లాన్ ప్రకారం 66 అడుగులకు చేపట్టాలి. అయితే 50 అడుగులకే విస్తరించాలనే స్థానికుల డిమాండ్‌ను జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం.

రామన్నపాలెంలో నీటి చౌర్యం!

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు



జగనన్న కాలనీలో ట్యాంకర్‌కు నీటిని మళ్లిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, ఏప్రిల్ 24: ఎండలు మండుతుండడంతో చాలా చోట్ల జనం తాగునీటికి ఇబ్బందులు పడుతుండగా, కొందరు దర్జాగా నీటి చౌర్యానికి పాల్పడుతూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని రామన్నపాలెం జగనన్న కాలనీలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు, తాగునీటి అవసరాల దృష్ట్యా అధికారులు బోరును ఏర్పాటు చేశారు. కొందరు వ్యక్తులు ఈ బోరు నీటిని చౌర్యం చేస్తూ ట్యాంకర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. ఈ తంతు గత పదిరోజులుగా సాగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అక్కడివారు వాపోతున్నారు. ఈ కారణంగా కాలనీలో తమ అవసరాలకు తగిన విధంగా నీరు అందుబాటులో ఉండడం లేదని చెపుతున్నారు. స్థానిక అధికారుల ఈ విషయమై దృష్టి సారించకుంటే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నామని పలువురు హెచ్చరించారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, ఏప్రిల్ 24: మండలంలోని గొడిచెర్ల హైవే జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని రేబాక గ్రామానికి చెందిన ఎస్.రమేశ్, ఎస్.పోటియ్య పాయకరావుపేట మండలంలో డెక్కన్ కంపెనీలో పని ముగించుకుని రేబాకరే బైక్‌పై వస్తుండగా గొడిచెర్ల హైవే వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. పాయకరావుపేట 108 సిబ్బంది రాము, శ్రీనివాస్ సంఘటనా స్థలలానికి చేరుకుని వారిని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా వుండడంతో అనకాపల్లి తరలించగా, ఎస్.రమేశ్ మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

విధి నిర్వహణలో ఉన్న లైన్‌మన్‌పై దాడి



గాయపడిన ఈపీడీసీఎల్ లైన్‌మన్ శ్రీను

కోటవురట్ల, ఏప్రిల్ 24: మండలంలోని అన్నవరం ఏపీఈపీడీసీఎల్ లైన్‌మన్ సింగంపల్లి శ్రీనుపై ప్రైవేట్ లైటింగ్ యాజమానులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో లైన్‌మన్ శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. అన్నవరంలో అమ్మవారి పండుగ సందర్భంగా లైటింగ్ కోసం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ వాడడంతో ఓవర్ లోడ్ కారణంగా ఫ్యూజ్ పోయిందని స్థానికులు లైన్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. లైటింగ్ విద్యుత్ వైర్‌ను తప్పించి ఫ్యూజ్ వేస్తుండగా ప్రైవేట్ లైటింగ్ యాజమానులు వెనుక నుంచి కర్ర, కటింగ్ ప్లేయర్‌తో తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. లైన్‌మన్ శ్రీనుకు బలమైన గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో కుట్లు వేశారు. శ్రీనుపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై విద్యుత్ శాఖ ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్యూటీలో ఉన్న ఉద్యోగిపై దాడి పట్ల విద్యుత్ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్ : యువకుడి మృతి

కోటవురట్ల, ఏప్రిల్ 24: పందూరు జాతరకు వెళ్లి తిరిగి రాత్రి వేళలో బైక్‌పై వస్తున్న యువకుడు నిద్రమత్తులో చెట్టును ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట మండలం నూతన గట్టుపాలెం గ్రామానికి చెందిన అంజూరి నాగేశ్వరరావు (22) డ్రైవరుగా పనిచేస్తున్నాడు. మంగళవారం మండలంలోని పందూరు అమ్మవారి జాతరకు బంధువులు ఇంటికి వచ్చాడు. పండుగ చూసుకొని రాత్రి 11.30 నిమిషాలకు తిరుగు ప్రయాణం అయ్యాడు. బయలదేరి కిలోమీటరు దూరంలో రామచంద్రపురం జంక్షన్ దాటిన తర్వాత నిద్రమత్తులో రోడ్డుపక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. బుధవారం మధ్యాహ్నం 3గంటల వరకు ఎవరు చూడలేదు. రోడ్డుపై బైక్‌పై వెళుతున్న వ్యక్తి చెట్టు ఢీకొనడంతో బైక్ దెబ్బతిన్నదని, గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఒక వ్యక్తి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి సెల్‌ఫోన్ ఆధారం పందూరులో బంధువులకు సమాచారం తెలియచేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కోటవురట్ల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా గండి బాబ్జీ



విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సంస్థాగతమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకూ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీని పెందుర్తికి మార్చింది. అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి నియామకం చర్చకు రాగా...తన కుమారుడు వంశీకి అవకాశం ఇవ్వాలని బాబ్జీ కోరారు. ఇదే సమయంలో జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్ కూడా పెందుర్తి ఇన్‌చార్జి పదవి ఆశించారు. కానీ చివరకు బాబ్జీని నియమిస్తూ బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు. ఇక ఇటీవల పార్టీలో చేరిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్‌ను విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. విశాఖ దక్షిణ టికెట్ ఆశించిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్‌ను ఉత్తర నియోజకవర్గం ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ప్రస్తుతం ఉత్తర నియోజకవర్గానికి ఇన్‌చార్జి ఎవరూ లేకపోవడంతో నజీర్‌కు ఎన్నికల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

ప్రయాణికులకు రైల్వే స్టేషన్లలో ఎకానమీ మీల్స్

విశాఖపట్నం, ఏప్రిల్ 24: రైల్వే ప్రయాణికుల తక్కువ ధరలో నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేందుకు ఐఆర్‌సీటీసీతో కలిసి భారతీయ రైల్వే ఎకానమీ మీల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా సాధారణ కోచ్‌ల్లో ప్రయాణించేవారి సౌకర్యార్థం రెండు రకాల ధరలతో భోజనం అందిస్తోంది. కేవలం సాధారణ భోజనం రూ.20, కాగా స్నాక్స్‌తో కూడిన భోజనం రూ.50గా ధర నిర్ణయించారు. తూర్పుకోస్తారైల్వే సంబంధించి ప్రస్తుతం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్లలో స్టాల్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇతర మేజర్ స్టేషన్లలో జన ఆహార యూనిట్లలో ఎకానమీ భోజనం లభించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ మాట్లాడుతూ జనరల్ సెకెండ్ క్లాసు కోచ్‌లోని ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అ లాగే, వేసవి దృష్ట్యా తాగునీరు, మజ్జిగ తదితర పానీయాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేయనున్నామని పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 24: వివిధ కారణాల దృష్ట్యా పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

వయా విజయనగరం, రాయగడ, రాయపూర్, నాగపూర్ మీదుగా...

ఈనెల 28 నుంచి వచ్చే నెల ఐదు వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్ ప్రెస్ , తిరుగు ప్రయాణంలోని న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28 నుంచి వచ్చే 15 వరకు, మే 15 నుంచి 21 వరకు; విశాఖ-గాంధీధాం వీక్లీ ఎక్స్‌ప్రెస్ మే 2, 9, 16, తిరుగు ప్రయాణంలోని గాంధీధాం-విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28, మే 5, 19న; పూరి-వోకా ఎక్స్‌ప్రెస్ ఈనెల 28, మే 5, 19న, తిరుగు ప్రయాణంలో వోకా-పూరి ఎక్స్‌ప్రెస్ మే 1, 8, 15న; విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 29, మే 3, 6, 10, 17న, తిరుగు ప్రయాణంలోని నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 28, మే 1, 5, 8, 15, 19న వయా విజయనగరం, రాయగడ, రాయపూర్, నాగపూర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా..

ఈనెల 28 నుంచి మే ఐదువరకు, అలాగే మే 15 నుంచి 21 వరకు విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలోని ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28 నుంచి మే ఐదు వరకు, అలాగే మే 15 నుంచి 21 వరకు; షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ మే 2, 3, 8, 9, 20, 21న, తిరుగు ప్రయాణంలోని హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మే 3, 4, 9, 10, 21, 22న; సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 21న వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయి. ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మే 2, 3, 8, 9, 20, 21న, తిరుగు ప్రయాణంలోని భువనేశ్వర్-ముంబాయి ఎక్స్‌ప్రెస్ మే 2, 3, 8, 9, 20, 21న; సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29, మే 6, 20న, తిరుగు ప్రయాణంలోని షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 30, మే 7, 21న; షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మే 8న, తిరుగు ప్రయాణంలోని సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ మే 10న వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ఇక, యశ్వంత్‌పూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ మే 5, 19న వయా విజయవాడ, గుంటూరు, నంద్యాల, గుంతకల్లు, బ్యాలరీ మీదుగా నడుస్తుంది. భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు మే ఐదు నుంచి 20 వరకు, విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు మే 9నుంచి 21 వరకు మధిర స్టేషన్‌లో హాల్ట్ ఉండదు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

నియోజకవర్గంలోని మండలాలు 1. మాడుగుల, 2. దేవరాపల్లి, 3. కె.కోటపాడు, 4. చీడికాడ	
మొత్తం ఓటర్లు	1,87,223
మహిళలు	91,291
పురుషులు	95,921
ఇతరులు	11

ఓటరు మాట

ప్రజల ఆకాంక్షలను గౌరవించాలి



చట్టసభలకు ఎన్నికయ్యే అభ్యర్థులు ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ అందుకు అనుగుణంగా పని చేయాలి. జనాకర్షక పథకాలనే కాకుండా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వాలి. ల్యాండ్ మార్కుగా ఉండే ప్రాజెక్టులు నిర్మిస్తే రాష్ట్రానికి అభివృద్ధి సూచికలుగా మారుతాయి. చట్టాలపై అవగాహన ఉండి, చట్టసభల్లో చురుగ్గా వ్యవహరిస్తూ భవిష్యతరాలకు భరోసా కల్పించే పథకాలు రూపొందించాలి. అలాంటి వారికి ఓటువేయాలి.

- ఎస్ శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగి, అనకాపల్లి

ఉపాధికి భరోసా అవసరం



యువతకు ఉపాధి అవకాశాలు, మంచి కేరీర్ అందించే ఐటీ రంగం అభివృద్ధి చెందాలి. నైపుణ్యం ఉన్న యువకులు ఐటీ రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరింత మందికి ఉపాధి కల్పించే అవకాశాలున్నాయి. ఇది రాష్ట్రంలో సంపద సృష్టికి దోహదపడుతుంది. ఈ దిశగా ఆలోచించే ప్రభుత్వం కొలువు తీరాలి. అలాంటి నేతలకు ఓటు వేయాలి.

- శివసాయి, ఐటీ ఉద్యోగి, అనకాపల్లి

ప్రలోభాలతో జాగ్రత్త



ఓటర్లను ప్రలోభ పెట్టి గెలవాలనుకునే వారిని ఓడించాలి. ఇలాంటి వారు గెలిస్తే సంపాదనపైనే దృష్టి పెడతారు. ఓటరు బాధ్యతగా వ్యవహరిస్తే రాష్ట్ర భవిష్యత్తును మార్చే ప్రభుత్వం సాధ్యం. అభివృద్ధి, ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చే నేతలను ఎన్నుకుంటే రాష్ట్రానికి, దేశానికి మేలు జరుగుతుంది. ఈ దిశగా ఓటర్లు ఆలోచించాలి.

- పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, మద్దిలపాలెం, విశాఖ

అన్న క్యాంటీన్లు తెరవాలి...




పేదవారికి ఆకలి తీర్చే రూ.5 భోజన పథకాన్ని చట్టబద్ధం చేసి అమలుచేయాలి. అన్నక్యాంటీన్లను మళ్లీ తెరవాలి. శాంతి భద్రతలను పటిష్ఠం చేయాలి, అత్యాచార నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలి. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేయగలిగే పార్టీని, నేతలను ఎన్నుకోవాలి. రాష్ట్ర ప్రగతి కాంక్షించి ప్రజలంతా మంచి నాయకుడిని ఎన్నుకోవాలి.

- జీఎల్ఎంఆర్ పట్నాయక్, విశ్రాంత ఉద్యోగి, పెందుర్తి

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



మాడుగుల గ్రామం వ్యూ


కాంగ్రెసేతర పార్టీలకు మాడుగుల పట్టం

1952లో నియోజకవర్గం ఆవిర్భావం | **ఇప్పటివరకూ 15సార్లు ఎన్నికలు**

జిల్లాలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న నియోజకవర్గాల్లో మాడుగుల ఒకటి. సుదీర్ఘ కాలం ఈ ప్రాంతం ఒరియా రాజుల పాలనలో ఉండేది. ఏజెన్సీకి ముఖద్వారంగా అలరారే ఈ నియోజకవర్గంలో ఓటర్ల తీర్పు ఆది నుంచి భిన్నంగా ఉండేది. కానీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత చాలా కాలం పాటు ప్రజలు ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారు. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకూ మొత్తం పదిహేనుసార్లు ఎన్నికలు జరగ్గా ఆరుసార్లు తెలుగుదేశం, మూడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నియోజక వర్గానికి సంబంధించి చెప్పుకోవాలంటే ఒక విశేషం ఉంది. 1983లో తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఆ పార్టీ నుంచి పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణ వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. ఈ నియోజక వర్గం నుంచి ఐదుసార్లు గెలిచిన ఏకైక నాయకుడు రెడ్డి సత్యనారాయణ. ఆయన రికార్డును ఎవరూ అధిగమించలేకపోయారు.

- ఆరుసార్లు టీడీపీ అభ్యర్థుల గెలుపు
- రెడ్డి సత్యనారాయణ రికార్డు... వరుసగా ఐదుసార్లు ఎన్నిక
- మూడుసార్లు కాంగ్రెస్, వైసీపీ రెండుసార్లు విజయం
- 1955లో ప్రజా పార్టీ తరపున ఓడి, 1962లో ఇండిపెండెంట్‌గా గెలిచిన తెన్నేటి విశ్వనాథం


రెడ్డి సత్యనారాయణ


కరణం ధర్మశ్రీ


కురచా రామునాయుడు


గవిరెడ్డి రామానాయుడు



బూడి ముత్యాలనాయుడు

నియోజకవర్గ చరిత్ర...

మాడుగుల నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటినుంచి 2019 వరకు పదిహేనుసార్లు ఎన్నికలు జరిగాయి. 1952 ఎన్నికల్లో కృషీకార్ లోక్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బోజంగి గంగయ్యనాయుడు...కాంగ్రెస్ అభ్యర్థి ఇలకుర్తి సత్యనారాయణపై 3,221 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 1955లో ప్రజా సోషలిస్ట్ పార్టీకి చెందిన దొండా శ్రీరామ్మూర్తి...ప్రజాపార్టీకి చెందిన తెన్నేటి విశ్వనాథంపై 4,869 ఓట్ల మెజారిటీతో, 1962లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథం...కాంగ్రెస్ అభ్యర్థి దొండా శ్రీరామ్మూర్తిపై 18,585 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక 1967లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన మహరాణి రమాకుమారిదేవి...ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్.భూమిరెడ్డి సత్యనారాయణపై 20,257 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 1972లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రమాకుమారిదేవి పోటీ చెయ్యకపోవడంతో ఆమె స్థానంలో బొడ్డు కళావతి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగి ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్.భూమిరెడ్డి సత్యనారాయణపై 6,344 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1978లో ఇండిపెండెంట్ అభ్యర్థి కురచా రామునాయుడు, ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి గుమ్మాల ఆదినారాయణపై 437 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. అలాగే 1983లో టీడీపీ నుంచి తొలిసారి బరిలోకి దిగిన రెడ్డి సత్యనారాయణ...కాంగ్రెస్ అభ్యర్థి వారాడ (బొడ్డు) సూర్యనారాయణమూర్తిపై 16,882 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1985 మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కురచా రామునాయుడుపై 28,421 ఓట్ల తేడాతో రెండో పర్యాయం కూడా రెడ్డి సత్యనారాయణ గెలిచారు. అలాగే 1989లో కాంగ్రెస్ అభ్యర్థి కురచా రామునాయుడుపై 10,084 ఓట్లతో, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి కిలపర్తి సూరిఅప్పారావుపై 27,091 ఓట్ల ఆధిక్యంతో, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దొండా కన్నబాబుపై 5,831 ఓట్ల ఆధిక్యంతో రెడ్డి సత్యనారాయణ గెలుపొందారు. రెడ్డి సత్యనారాయణ నందమూరి తారకరామారావు మంత్రివర్గంలో పశు సంవర్ధకశాఖ శాఖా మంత్రిగా, శాసన ఉపనాయకుడిగా పనిచేశారు. 2004లో టీడీపీ నుంచి పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కరణం ధర్మశ్రీ 8,737 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2009 కాంగ్రెస్ అభ్యర్థి అవుగెడ్డ రామ్మూర్తినాయుడుపై టీడీపీ నుంచి పోటీకి దిగిన గవిరెడ్డి రామానాయుడు 6,827 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇక 2014, 2019లో టీడీపీ అభ్యర్థి రామానాయుడుపై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బూడి ముత్యాలనాయుడు వరుసగా 4,761, 16,396 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున బండారు సత్యనారాయణమూర్తి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ పోటీలో ఉన్నారు. ఇంకా ఇతర పార్టీల తరపున, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నా...ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీ మధ్యే జరగనున్నది.

● మాడుగుల


దొండా శ్రీరామ్మూర్తి


తెన్నేటి విశ్వనాథం


రాణి రమాకుమారిదేవి

విజేతలు, మెజారిటీల వివరాలు

సం.	విజేత	పార్టీ	ఓట్లు	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు	విజేత మెజారిటీ
1952	బోజంకి గంగయ్యనాయుడు	కేఎల్‌పి	10,525	ఇ.సత్యనారాయణ	కాంగ్రెస్	7,304	3,221
1955	దొండా శ్రీరామ్మూర్తి	పీఎస్‌ఎల్‌పి	18,862	తెన్నేటి విశ్వనాథం	ప్రజాపార్టీ	13,993	4,869
1962	తెన్నేటి విశ్వనాథం	ఇండిపెండెంట్	26,478	దొండా శ్రీరామ్మూర్తి	కాంగ్రెస్	7,893	18,585
1967	రాణి రమణకుమారీదేవి	కాంగ్రెస్	34,561	ఎస్.బి.సత్యనారాయణ	ఇండి	14,304	20,257
1972	బొడ్డు కళావతి	కాంగ్రెస్	26,764	ఎస్.బి సత్యన్నారాయణ	ఇండి	20,420	6,344
1978	కురచా రామునాయుడు	ఇండిపెండెంట్	19,147	గుమ్మాల ఆదినారాయణ	కాంగ్రెస్	18,710	437
1983	రెడ్డి సత్యనారాయణ	తెలుగుదేశం	35,439	బొడ్డు సూర్యనారాయణ	కాంగ్రెస్	18,557	16,882
1985	రెడ్డి సత్యనారాయణ	తెలుగుదేశం	46,104	కురచా రామునాయుడు	కాంగ్రెస్	17,683	28,421
1989	రెడ్డి సత్యనారాయణ	తెలుగుదేశం	48,872	కురచా రామునాయుడు	కాంగ్రెస్	38,788	10,084
1994	రెడ్డి సత్యనారాయణ	తెలుగుదేశం	51,230	కిలపర్తి సూరిఅప్పారావు	కాంగ్రెస్	24,139	27,091
1999	రెడ్డి సత్యనారాయణ	తెలుగుదేశం	53,407	దొండా కన్నబాబు	కాంగ్రెస్	47,576	5,831
2004	కరణం ధర్మశ్రీ	కాంగ్రెస్	50,361	రెడ్డి సత్యన్నారాయణ	తెలుగుదేశం	41,624	8,737
2009	గవిరెడ్డి రామానాయుడు	తెలుగుదేశం	52,762	అవుగెడ్డ రామ్మూర్తినాయుడు	కాంగ్రెస్	45,935	6,827
2014	బూడి ముత్యాలనాయుడు	వైసీపీ	72,299	గవిరెడ్డి రామానాయుడు	తెలుగుదేశం	67,538	4,761
2019	బూడి ముత్యాలనాయుడు	వైసీపీ	78,830	గవిరెడ్డి రామానాయుడు	తెలుగుదేశం	62,438	16,396



చట్టసభల్లో సత్తా చాటిన మహిళలు

ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పలువురు ఎన్నిక... విద్యావంతులే అధికం


అల్లు భానుమతి


రాజాన రమణి


పిన్నింటి వరలక్ష్మి


పురందేశ్వరి


గిడ్డి ఈశ్వరి


కొత్తపల్లి గీత


మణికుమారి


ముత్యాలపాప


ఉమాగజపతిరాజు


వంగలపూడి అనిత


కొట్టగుల్లి భాగ్యలక్ష్మి


జి.మాధవి


భీశెట్టి సత్యవతి

విశాఖ జిల్లా నుంచి ఎందరో మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యారు. వీరిలో అత్యధికులకు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా ప్రజా ప్రతినిధులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. అయితే చాలా మందికి రెండోసారి పోటీ చేయడానికి అవకాశం లభించలేదు. వచ్చిన కొద్దిమందిలో అత్యధికులు ఓటమి పాలయ్యారు.

పార్లమెంటు సభ్యులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విశాఖ పార్లమెంటు స్థానం నుంచి మొట్టమొదటిసారిగా 1989లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా విజయనగర సంస్థానాధీశుడు ఆనందగజపతి రాజు మొదటి భార్య ఉమాగజపతిరాజు పోటీ చేసి గెలుపొందారు. ఆమెకు మరోసారి పోటీ చేయడానికి అవకాశం లభించలేదు. ఆ తర్వాత మరో పది సంవత్సరాల తర్వాత దగ్గుబాటి పురందేశ్వరి 2009లో విశాఖ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. ఆమె కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ఉమాగజపతి, పురందేశ్వరిలు మంచి పార్లమెంటేరియన్లుగా పేరు సంపాదించుకున్నారు. 2014 ఎన్నికల్లో అరకులోయ పార్లమెంటు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థినిగా పోటీ చేసిన కొత్తపల్లి గీత విజయం సాధించారు. ఇక 2019లో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి డాక్టర్ భీశెట్టి సత్యవతి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), అరకులోయ నుంచి జి.మాధవి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ) ఎంపీలుగా ఎన్నికయ్యారు.

అసెంబ్లీ స్థానాల నుంచి...

అసెంబ్లీ ఎన్నికలకు వస్తే 1972లో మాడుగుల నియోజకవర్గం నుంచి బొడ్డు కళావతి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆమెకు విజయనగరం జిల్లాలో పోటీ చేసేందుకు అవకాశం వచ్చిన ఓటమి పాలయ్యారు. మాడుగుల నియోజకవర్గం నుంచి 1983లో అల్లు భానుమతికి తెలుగుదేశం పార్టీ టికెట్ ఇచ్చింది. అయితే ఆమె నామినేషను తిరస్కరణకు గురికావడంతో డమ్మీగా వేసిన రెడ్డి సత్యనారాయణ అభ్యర్థి అయ్యారు. 1983లోనే విశాఖ-1 నుంచి గ్రంధి మాధవి తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికయ్యారు. తదనంతర పరిణామాల్లో ఆమె నాదెండ్లకు మద్దతుగా నిలిచారు. 1985లో అసెంబ్లీ రద్దయిపోయింది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో అల్లు భానుమతికి అవకాశం లభించి శాసన సభకు ఎన్నికయ్యారు. 1985లోనే విశాఖ-2 నియోజకవర్గం నుంచి రాజాన రమణి ప్రాతినిధ్యం వహించారు. 1989లో విశాఖపట్నం నుంచి ఈటి విజయలక్ష్మికి శాసనసభ్యురాలిగా అవకాశం లభించింది. ఆ తర్వాత 1994లో ఆమెను పరవాడ నియోజక వర్గానికి మార్చడంతో ఓటమి పాలయ్యారు. ప్రొఫెసర్‌గా ఉన్న పిన్నింటి వరలక్ష్మి 1989 ఎన్నికల్లో విశాఖ-2 నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థినిగా పోటీ చేసి, గెలుపొంది శాసనసభలో అడుగు పెట్టారు. మహిళల ప్రాతినిధ్యం సిటీలో ఎక్కువగా ఉండగా రూరల్ జిల్లాలో అంతగా కనిపించలేదు. 2009లో బోళం ముత్యాలపాప నర్సీపట్నంలో అయ్యన్నపాత్రుడిని ఓడించి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత చాలా ఏళ్లు ఎవరికీ అవకాశం లభించలేదు. 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, పాడేరు నుంచి గిడ్డి ఈశ్వరి శాసనసభకు ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో పాడేరు నుంచి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. వచ్చే నెలలో జరుగుతున్న ఎన్నికల్లో విశాఖ లోక్‌సభ స్థానానికి బొత్స ఝాన్సీ (వైసీపీ), అరకులోయ స్థానానికి కొత్తపల్లి గీత (బీజేపీ), చెట్టి తనూజరాణి (వైసీపీ), పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత (టీడీపీ), పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి గిడ్డి ఈశ్వరి (టీడీపీ), మాడుగుల నుంచి ఈర్లె అనురాధ (వైసీపీ) పోటీలో దిగుతున్నారు. వీరిలో విజేతలుగా ఎవరు నిలుస్తారో చూడాలి.

● భీమునిపట్నం (రూరల్)

ప్రచారంపై ఎండ ప్రతాపం!

బయటకు వచ్చేందుకు భయపడుతున్న నేతలు, కేడర్

40 డిగ్రీలు దాటుతున్న పగటి ఉష్ణోగ్రతలు

వేడి నేపథ్యంలో ప్రచారం స్టైల్ మార్చిన పార్టీలు

- ఉదయం 6 నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు తరువాత ప్రచారానికి మొగ్గు
- సభలు, సమావేశాలూ సాయంత్రం వేళల్లోనే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

గత కొద్ది రోజులుగా పెరుగుతున్న ఎండ తీవ్రత అభ్యర్థుల ప్రచారంపై పడుతోంది. పగటిపూట బయటకు వచ్చేందుకే జనం భయపడుతున్న నేపథ్యంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా ప్రచారానికి విరామమే మంచిదని అభిప్రాయపడుతున్నారు. దీంతో రాజకీయ పార్టీల నేతలు ప్రచార స్టైల్ మార్చారు. ఉదయం ఆరు గంటలకే ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్న నాయకులు పది గంటల తరువాత కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. మళ్లీ సాయంత్రం నాలుగు తరువాతే జనంలోకి వచ్చి ప్రచారం చేస్తున్నారు.

రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా ఎండలు తీవ్రతరమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భరించలేనంత ఎండలు కాస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో వడగాడ్పులు కూడా వీస్తున్నాయి. ఉదయం పదిగంటలకే భానుడు చుర్రుమనిపిస్తుండడంతో ప్రచారం చేసేందుకు పార్టీల నాయకులు, కార్యకర్తలు భయపడుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నేతలు ఉదయం నుంచి రాత్రి పదిగంటల వరకు ప్రచారం చేయడానికే మొగ్గుచూపుతారు. అయితే మండు వేసవిలో ఎన్నికలు కావడంతో అలాంటి ప్రచారాలకు చెక్ పడింది. ఎండలకు తోడు వడగాడ్పులకు రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ప్రచారం చేసేవారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ దెబ్బకు భయపడి అనేక ప్రాంతాల్లో సాయంత్రం నాలుగు దాటిన తరువాతే పోటీలోని అభ్యర్థులు, కేడర్ బయటకు వచ్చి ప్రచారం సంగతి చూస్తున్నారు. మరికొన్నిచోట్ల ఉదయం ఆరుగంటల నుంచి పదిగంటల వరకు ర్యాలీలు, ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఆ తరువాత పార్టీ కార్యాలయాల్లో ఆయా సామాజిక వర్గాలు, ఇతర వర్గాల నేతలతో సమావేశాలు, సమీక్షలు, అసంతృప్తి నేతలకు బుజ్జగింపులు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు ఎండలో ప్రచారం కోసం వచ్చే నాయకులు, కార్యకర్తలకు అయ్యే ఖర్చు పెరుగుతోందని చెబుతున్నారు. ఎప్పటికప్పుడు శీతలపానీయాలు, ఐస్ వాటర్‌ను వారికి అందించాల్సి రావడం వ్యయ ప్రయాసలకు గురిచేస్తోందని వాపోతున్నారు.

సభలు, సమావేశాలూ సాయంత్రమే

జిల్లాలో ఆయా పార్టీల ముఖ్య నేతల పర్యటనలు, రోడ్‌షోలు, బహిరంగ సభలను కూడా సాయంత్రం వేళలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఎండలకు భయపడి ప్రచారం కూడా చేయలేని స్థితిలో పగటిపూట సమావేశాలు పెడితే జనం వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఎండ ప్రభావం ప్రచారంపై పడిందని పలువురు అభ్యర్థులు అంగీకరిస్తున్నారు. మరో 20 రోజులు ప్రచారం చేయాల్సి ఉండడం, ఎండలు మరింతగా పెరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే...

వేసవి ఎండల ప్రభావం ప్రచారంపై పడుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. గాడ్పుల ప్రభావం అంతగా లేకపోయినా రోజుల తరబడి ఎండలు కొనసాగుతున్నందున వాతావరణం వేడెక్కుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలప్రచారం చేసే అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఉదయం 10 గంటలలోపే ప్రచారం ముగించాలని, అభ్యర్థులు, అనుచరులు ఎప్పటికప్పుడు తాగునీరు తీసుకోవాలంటున్నారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం తలపై టోపీలు ధరిస్తే వడదెబ్బ నుంచి రక్షణ లభిస్తుందంటున్నారు. ఉదయం పదిగంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లో బయటకు రాకపోవడమే మంచిదంటున్నారు. మధ్యాహ్న సమయంలో రాయలసీమ, కోస్తాలో మారుమూల ప్రాంతాల్లో ప్రచారం చేయవద్దని, తీరప్రాంతతో పోల్చితే ఈ ప్రాంతాల్లో వడదెబ్బ తగిలే ప్రమాదం ఎక్కువగా ఉంటుందంటున్నారు.



టీడీపీలో చేరిన పలు కుటుంబాలు



అనిత సమక్షంలో టీడీపీలో చేరిన రాజయ్యపేట గ్రామస్థులు

నక్కపల్లి, ఏప్రిలల్ 24: మండలంలోని రాజయ్యపేటకి చెందిన పలు కుటుంబాల వారు బుధవారం ఉదయం పాయకరా వుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలోకి చేరారు. నక్కపల్లి సమీపంలో వున్న ఆమె నివాసంలో 40 కుటుంబాలకు చెందిన యువకులు, మహిళలకు అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించారని, అందువల్ల రికార్డు స్థాయిలో ప్రజలు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య, పిక్కి సత్యారావు, సిరిపల్లి అప్పలరాజు, పిక్కి కోదండరావు, ఎరుపిల్లి బంగారి, మడదా రాంబాబు, వాసపల్లి రాము పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకండి

పాయకరావుపేట : రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను పిలుపునిచ్చారు. గురువారం కూటమి పార్టీల నాయకులు పట్టణంలోని షీలానగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున పోటీచేస్తున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనితలకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, లెక్కల గోవిందు, పెదిరెడ్డి పండు, భాస్కర చౌదరి, దంతులూరి నాగు, కశింకోట సత్తిబాబు, చిరుకూరి పేర్రాజు, రాజాన ఆది, జనసేన నాయకులు బీఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

గెలిపిస్తే పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తా

భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు

పెందుర్తి, ఏప్రిల్ 24: జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్ బాబు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసులో ఈఆర్వో శేషశైలజకు నామినేషన్ పత్రాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, గండి బాబ్జీ, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, బీజేపీ ఇన్‌చార్జి సీఎం శ్రీనివాసులనాయుడు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. ముందుగా పంచకర్ల వెంకటాద్రి ఆలయానికి విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వేపగుంటలోని శ్రీకృష్ణదేవరాయులు సామాజిక భవనం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తానన్నారు. దీనిపై ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతో అధ్యయనం చేశానన్నారు. పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తానని బీరాలు పలికి ఎమ్మెల్యే అయ్యాక చేతులెత్తేసిన వైసీపీ అభ్యర్థి ఏమి ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

ప్రత్యేక ఆకర్షణగా హైపర్ ఆది

పంచకర్ల నామినేషన్ కార్యక్రమంలో 'జబర్దస్త్' ఫేమ్, సినీ నటుడు హైపర్ ఆది ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన తనదైన శైలిలో జగన్‌పై పంచ్‌లు వేశారు. ఇంట్లోని సొంత అక్కాచెల్లెళ్లను రోడ్డుపాలు చేసిన జగన్ ప్రజలకు ఇంకేం చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, సేనాపతి శంకరరావు, రెడ్డి నారాయణరావు, అయిత సింహాచలం, వేగి పరమేశ్వరరావు, పైల జగన్నాథం, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులుగా చేస్తాం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలందరికీ లక్షాధికారులుగా చేస్తామని జనసేన 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తిలో జనసేన, టీడీపీ, బీజేపీలకు చెందిన మహిళా కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ మహిళలే విజయసారథులన్నారు. మహిళలను వంచించిన జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా అభ్యర్థిగా సీఎం రమేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



పెందుర్తిలో భారీ ర్యాలీగా సాగుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

జనసేనలో చేరిన మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీను



సుందరపు సమక్షంలో జనసేనలో చేరిన మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీనివాసరావు, అనుచరులు

ఎలమంచిలి, ఏప్రిల్ 24: స్థానిక మునిసిపల్ మాజీ కౌన్సిలర్, వైసీపీ పార్టీ నేత పిట్టా శ్రీనివాసరావు తన అనుచరులతో కలిసి బుధవారం అచ్యుతాపురంలో జనసేన పార్టీలో చేరారు. పిట్టా శ్రీనుతోపాటు అనుచరులకు జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, టీడీపీ నేతలు కాండ్రకోట చిరంజీవి, కరణం రవి, జనసేన నేతలు మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, పల్లా సత్యనారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని జడ్. చింతువా పంచాయతీలోని లోవపాలెం, గజిరెడ్డిపాలెం గ్రామాల వైసీపీ నాయకులు సూరాడ వెంకన్న, ఎజ్జల కోదండరామ్, వార్డు సభ్యుడు మైలపల్లి అప్పలకొండ, తమ అనుచరులతో కలిసి బుధవారం జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డీఎస్ఎన్ రాజు, పప్పల నూకన్నదొరగిరి, కొండబాబు, ఎరుపల్లిరాజు, పాల్గొన్నారు.



జనసేనలో చేరిన లోవపాలెం, గజిరెడ్డిపాలెం వైసీపీ శ్రేణులు

ప్రమాదకరంగా శేషుగెడ్డపై కల్వర్టు



ఎలమంచిలి రోడ్డుపై రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

ఎలమంచిలి, ఏప్రిల్ 24: నిత్యం వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, వాహనాల రాకపోకలు సాగించే అనకాపల్లి ప్రధాన రహదారిలో శేషుగెడ్డపై ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన మినీ వంతెన ప్రమాదకరంగా మారడం, ఇరుపక్కలా ఎటువంటి రక్షణ గోడలు లేకపోవడంతో అదుపు తప్పితే ఆస్పత్రికే అన్న చందంగా తమారైంది. ఈ రోడ్డు మీదుగా వేలాది మంది ప్రజలతోపాటు నిత్యం పాఠశాలల విద్యార్థులు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఇదే రహదారి మీదుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగిస్తున్నా సరే పట్టించుకోకపోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ కల్వర్టుపై రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వడగాడ్పులకు జనం విలవిల



కోటవురట్లలో ఎండ నుంచి రక్షణగా చున్నీని కప్పుకున్న మహిళలు

కోటవురట్ల, ఏప్రిల్ 24: రోజు రోజుకు భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. మంగళవారం సెగలు కక్కుతూ ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాడు. ఎండలు మండిపోతుండడంతో జనం విలవిలలాడుతున్నారు. ఆపై ఉక్కపోత, వడగాడ్పులతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటే భీతిల్లుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచే సూర్యతాపం మొదలైంది. 11 గంటల నుంచి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆ సమాయాల్లో బస్సులు, ఆటోలు ఖాళీగా తిరిగాయి. శీత లపానీయాల దుకాణాలు మాత్రం కిటకిటలాడాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ రోడ్లపైకి రావడం లేదు. మంగవారం 39 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 5 గంటలకు చల్లబడింది.

అనకాపల్లిలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత

అనకాపల్లిటౌన్: పట్టణంలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు, అత్యల్ప ఉష్ణోగ్రత 26 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం నుంచి ఉక్కపోతతోపాటు వడగాడ్పులు వీయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు రహదారుల్లో జనసందడి తగ్గింది. ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు వడగాడ్పులు కారణంగా ఇబ్బందులు పడక తప్పలేదు. అయితే సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం చల్లబడడంతోపాటు ఈదురుగాలులు వీయడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఎండవేడిమిని తట్టుకో లేక...



ఎలమంచిలి, ఏప్రిల్ 24 : కొద్ది రోజులుగా భానుడి ప్రతాపాగ్నిని జనం తట్టుకోలేకపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడిగాలులు వీస్తుండడంతో జనం రోడ్లపై తిరగలేక ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఎలమంచిలి కొత్తపేట కాలనీలో ఓ శునకం తాగునీటి కోసం వెంపర్లాడింది. చివరకు ఓ దుకాణం వద్ద ఉన్న నీటిని తాగి ఉపశమనం పొందింది. పశు పక్షాదుల కోసం ఇళ్ల ముందు తాగేందుకు నీటిని ఉంచితే వాటికి ఎంత ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 24 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ క్లియరెన్స్ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగి సుబ్బరాజువీధి, గౌరీసంఘం వీధి, సతకంపట్టు, ఉమెన్స్ కాలేజీ, దిబ్బవీధి, రైతుసంఘం ఏరియా, దాడి భోగలింగం వీధి, అగ్గిమర్రి చెట్టు, అరుంధతినగర్‌ల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు. అలాగే ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో జంగిల్ కటింగ్, లైన్ వర్కు జరుపుతున్న కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆయన తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు 11 కేవీ ఉడ్‌పేట ఫీడర్ పరిధిలోని భీమునిగుమ్మం, మళ్లవీధి, శాఖవీధి, నాగవంశంవీధి, వేల్పుల వీధి, నాయుడువీధి, ఉడ్‌పేట, నరసింగరావు పేట, చవితినవీధి, ఫైర్ స్టేషన్ ప్రాంతం, దుర్గాలాడ్డి వీధి, జీవీ కోటేశ్వరరావు వీధి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్.రాయవరంలో.. మండలంలో కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా గురువారం ఆరు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. మండలంలోని తిమ్మాపురం, కొరుప్రోలు, కోనవానిపాలెం, పెదగుమ్ములూరు గ్రామాల్లో గురువారం చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎలమంచిలిలో.. మండలంలోని పురుషోత్తపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణిపురం, రేగుపాలెం, వెంకునాయుడు పాలెం, రామభద్రాపురం, లైనుకొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

కొత్తపేటలో రామాలయానికి శంకుస్థాపన

రాంబిల్లి, ఏప్రిల్ 24 : మండలంలోని కొత్తపేటలో బుధవారం నూతన రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థల దాతలైన తెడ్లపు కుటుంబీకులు, సబ్బవరానికి చెందిన శ్రీ వాసుదేవానంద సరస్వతి సమక్షంలో పురోహితుల మంత్రోచ్చరణల నడుమ రామాలయం శంకుస్థాపన కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వానపల్లి అరుణ, వానపల్లి జగన్నాథరావు, మాజీ సర్పంచ్ మాడెం రాజుబాబు, పుత్సా బాబూరావునాయుడు, ఎం.వెంకటరావు, తేలు వెంకటేశ్వరరావు, తేలు నరసింహరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

సీఎం రమేశ్ నామినేషన్‌కు తరలిన కూటమి నేతలు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 24 : అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా అనకాపల్లికి తరలివెళ్లారు. పూడిమడక నుంచి మేరుగు బాపునాయుడు నాయకత్వంలో వెయ్యి మంది టీడీపీ నాయకులు, అభిమానులు వంద ఆటోలు, 50 బైక్‌లతో ప్రదర్శనగా అనకాపల్లి తరలివెళ్లారు. ఖాజీపాలెంలో పీలా తులసీరామ్ నాయకత్వంలో బైక్ ర్యాలీగా వెళ్లారు. స్థానిక నాయకులు, కార్యకర్తల నినాదాలతో రహదారులు హడావిడిగా మారాయి.



సీఎం రమేశ్ నామినేషన్‌కు తరలి వెళుతున్న పూడిమడక టీడీపీ శ్రేణులు

ఈదురుగాలుల బీభత్సం

... 5వ పేజీ తరువాయి

విరిగి పడ్డాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు గంటల కొద్దీ అంతరాయం కలిగింది.

దేవరాపల్లిలో.. మండలంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తారెత్తించగా, ఆ తరువాత వర్షం కురిసింది. ఈదురుగాలులకు మండలంలోని నాగయ్యపేట, సీతంపేటకు చెందిన పరవాడ లక్ష్మయ్య, గాడి సూర్యనారాయణ, కర్రి అక్కునాయుడు, మరికొంత మంది రైతులకు చెందిన ఆరు ఎకరాల్లోని అరటి తోటలు నేలమట్టమయ్యాయి. చినసోంపురం, శ్రీరాంపురం, దేవరాపల్లి సంతతోట వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

చీడికాడలో..

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటలకు మేఘాలు కమ్ముకొని సాయంత్రం 4 గంటలకు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన జనం వర్షానికి ఊరట చెందారు.

అద్దె కార్యకర్తలు

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం వరకు లేదంటే మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ ఉండాల్సి వచ్చినా, ర్యాలీలో తిరగాల్సి వచ్చినా రూ.500 ఇస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఇలాంటి వారికి ఏకంగా రూ.వెయ్యి వరకూ ఇస్తున్నారు. ఒకేసారి అందరికీ అద్దె కార్యకర్తల అవసరం రావడంతో ప్రచారంలో పాల్గొనే కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. కాసేపు కూర్చొని వచ్చేయడం లేదంటే జెండా పట్టుకుని రెండు, మూడు గంటలు నినాదాలు చేయడం చేస్తే రూ.300 నుంచి రూ.500 వరకూ వస్తుండడంతో రాజకీయ కూలీలు కూడా అలాంటి కార్యక్రమాలకు ఆసక్తి చూపుతున్నారు. ఏ పార్టీవాళ్లు పిలిస్తే ఆ పార్టీ జెండా పట్టుకుని నినాదాలు చేస్తున్నారు. జనాలను సమీకరించే బాధ్యతను పార్టీ ముఖ్య నేతలు కాకుండా వార్డు స్థాయిలోని చోటా నేతలు, కార్పొరేటర్లకు అప్పగిస్తున్నారు. వార్డు నుంచి ఎంతమందిని తీసుకురావాలని చెబితే అంతమందిని నేతలు తీసుకువెళుతున్నారు. ఇదిలావుండగా నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన తర్వాత రాజకీయ కూలీలకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది.

ఒకవైపు ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారానికి, మరోవైపు నామినేషన్ ర్యాలీ/ ఊరేగింపులో పాల్గొనేందుకు జనాలను సమీకరించాల్సిన పరిస్థితి. దీంతో ఒకే సమయంలో వేర్వేరు కార్యక్రమాలు ఉండడంతో రాజకీయ కూలీలు ఎటు వెళ్లాలో తేల్చుకోలేని పరిస్థితిలో పడ్డారు. అయితే ఈ పరిస్థితిని కూలీలు కొందరు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు

. ఇప్పటివరకూ ఇస్తున్న రూ.300 అయితే తాము రాలేమని, ఎండలు తీవ్రంగా ఉండడంతో ఇబ్బందిపడాల్సి వస్తోందని, తమకు ఫలానా నియోజకవర్గంలో ఇస్తున్నట్టుగా రూ.వెయ్యి ఇస్తేనే వస్తామంటూ స్పష్టంచేస్తున్నారు. ఒకేసారి అంత మొత్తం పెంచేయడంతో వార్డు స్థాయి నేతలు, కార్పొరేటర్లు విషయాన్ని తమ నేతలకు వివరిస్తున్నారు.

ఎన్నికల ఖర్చు పెరిగిపోయిందనే బాధలో ఉన్న తమకు మరింత భారం పెరిగిపోతోందంటూ లబోదిబోమంటున్నారు. అయినప్పటికీ జన సమీకరణలో వెనుకబడితే ఓటింగ్‌పై ప్రభావం చూపుతుందనే భయంతో వారు అడిగినంత కాకుండా రూ.500 ఇచ్చేందుకు సమ్మతిస్తున్నారు. ఏదిఏమైనా ఎన్నికలు రాజకీయ పార్టీల నేతల తలరాతను ఎలా మార్చుతాయోగానీ, పనుల్లేక ఇబ్బందిపడుతున్న కూలీలకు మాత్రం ఉపాధి కల్పించాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

విజయీభవ సందడి

... 5వ పేజీ తరువాయి

అని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిందన్నారు. అనకాపల్లిలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందకుండా పోయాయన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంపీగా అనకాపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి సీహెచ్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన సాగుతోందని, 99 శాతం హామీలు నెరవేర్చామని అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్రంలోని పెద్దలతో మంచి సంబంధాలున్న సీఎం రమేశ్‌ను ఎంపీగా గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి సైకో, దుర్మార్గ పాలనను అంతమొందించాలన్నారు. జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, దేశంలో మోదీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపడితేనే ఆంధ్రా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ ర్యాలీలో జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణ, టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత, జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన జనసేన, టీడీపీ నేతలు



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు రామదాసు, డ్రీమ్స్‌నాయుడు

రాంబిల్లి, ఏప్రిల్ 24: అనకాపల్లిలో బుధవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల టీడీపీ, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. టీడీపీ, జనసేన నేతలు సుందరపు విజయకుమార్, బైలపూడి రామదాసు, ధర్మిరెడ్డి నాయుడు, పప్పల నూకన్నదొర, తదితరులు రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

సీఎం రమేశ్‌ను సత్కరించిన రత్నాకర్



బీజేపీ కార్యాలయంలో సీఎం రమేశ్‌ను సత్కరించిన రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 24: స్థానిక బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేను బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సత్కరించారు. విజయగణపతి ఆశీస్సులతో సీఎం రమేశ్ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుస్తారని ఆకాంక్షించారు.

వైసీపీ అభ్యర్థి భరత్‌కుమార్ నామినేషన్

కొత్తూరు, ఏప్రిల్ 24 : వైసీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ బుధవారం నామినేషన్ వేశారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి గాంధీనగరంలో ఉన్న రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్వో జాహ్నవికి మూడు సెట్ల నామినేషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ బీవీ.సత్యవతి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

మార్కెట్‌లో తక్షణమే లావాదేవీలు జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 24 : ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో తక్షణమే బెల్లం లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చెరకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం దొడ్డి రామునాయుడు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లం మార్కెట్‌లో పది రోజులుగా కొలగార్లు, వర్తకులకు మధ్య ఏర్పడిన సమస్య వల్ల మూసివేయడం సరికాదన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి స్పందించి యుద్ధప్రాతిపదికన లావాదేవీలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు షుగర్ ఫ్యాక్టరీల విషయాల్లో తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగిరెడ్డి సత్యనారాయణ, డి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండుగ



పరవాడ, ఏప్రిల్ 24 : రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండుగను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లుచేశారు. గ్రామం నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పండగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరవాడ సీఐ బాల సూర్యారావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాములవాకలో జోగులు ప్రచారం

కోటవురట్ల, ఏప్రిల్ 24: మండలంలోని ఆక్సాహెబ్‌పేట, పీకేపల్లి, చినబొడ్డేపల్లి, పాములవాక ల్లో బుధవారం వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ.సూర్యనారాయణరాజు, నాయకులు సాగి సీతబాబు (దత్తుడు) కిల్లాడ శ్రీనివాసరావు, పెట్ల రాంబాబు, సింగంపల్లి కిశోర్, చామంతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

18 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

పరవాడ, ఏప్రిల్ 24 : మండలంలోని వాడచీపురుపల్లి సచివాలయం పరిధిలో గల 18 మంది వలంటీర్లు తమ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్‌కు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునే సమయంలో వలంటీర్ పదవి అడ్డుగా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు వలంటీర్లు రాజీనామా పత్రంలో పేర్కొన్నారు.

కాఫీ హోటల్ వెనుక మంటలు

ఎలమంచిలి, ఏప్రిల్ 24: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా ఉన్న కాఫీ హోటల్ వెనుక ప్రాంతంలో బుధవారం ఉదయం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందిఇ. హోటల్ వెనుక చెత్తలో ఎవరో గుర్తు తెలియని వారు సిగరెట్ కాల్చి పడేసి ఉంటారని, స్వల్ప నష్టం తప్ప ప్రమాదం లేదని అగ్నిమాపక అధికారి తెలిపారు.

టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం

రాంబిల్లి, ఏప్రిల్ 24 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ లీగల్ సెల్ నాయకులు రవిరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీల శ్రేణులు బుధవారం రాంబిల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్‌కు గాజుగ్లాస్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూకరాజు, టీడీపీ నేతలు గోవింద్, నకరబోయిన రమణ, పండు పాల్గొన్నారు.

అరకొర సిబ్బంది.. విధులకు ఇబ్బంది..

నర్సీపట్నం సెబ్ స్టేషన్‌లో ఇదీ ప్రస్తుత పరిస్థితి

- నాలుగు మండలాల పరిధిలో 92 పంచాయతీలు
- అధికంగా నాటు సారా, గంజాయి, అక్రమ మద్యం కేసులు
- నియామకాలు చేపట్టని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నవారు తీవ్ర ఒత్తిడి గురవుతున్నవైనం

నర్సీపట్నం, ఏప్రిల్ 24 : గంజాయి, నాటు సారా, మద్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్‌లో సిబ్బంది నియామకాలను ప్రభుత్వం చేపట్టక పోవడంతో ఉన్నవారు తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. సరికదా ఇటువంటి నేరాలు అదుపు చేసేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎక్సైజ్ శాఖలోని సిబ్బందిని సర్దుబాటు చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ సిబ్బందికి గంజాయి, నాటు సారా, మద్యం అక్రమ రవాణాను అరికట్టే బాధ్యలను అప్పగించి, ఎక్సైజ్ శాఖకు ప్రభుత్వ మద్యం విక్రయాలు, రెస్టారెంట్ బార్‌లు లైసెన్స్‌లు బాధ్యలు అప్పగించారు.

ఈ సెబ్ పరిధిలో 92 పంచాయతీలు

ఇక్కడి సెబ్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట మండలాలు ఉన్నాయి. ఈ నాలుగు మండలాలలోని 92 పంచాయతీలలో సుమారు 200 గ్రామాలు ఉంటాయి. మిగిలిన సెబ్ స్టేషన్‌లు కంటే ఇక్కడ నాటు సారా కేసులు అధికం. నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లి, రోలుగుంట మండలం పెదపేట, కొంతలం గ్రామాలలో నాటు సారా



రావికమతం మండలంలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న కానిస్టేబుల్



నర్సీపట్నంలోని సెబ్ స్టేషన్

తయారీ, రవాణా, విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. సారా బట్టీలను కనిపెట్టి, దాచి పెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేయడం, నాటు సారా సీజ్, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం వంటి విధులు సెబ్ స్టేషన్ సిబ్బంది చేపట్టాలి. గ్రామాలలో పరివర్తన కార్యక్రమం చేపట్టి నాటు సారా తయారీ, విక్రయాలు జరక్కుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

నాలుగు నెలల్లో కేసుల వివరాలివి

ఇదిలావుంటే, గత డిసెంబరు 26 నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు 28 కేసుల్లో 362 లీటర్ల నాటు సారా సీజ్ చేసి 12 మందిని అరెస్టు చేశారు. సారా తయారీదారులు ప్లాస్టిక్ కవర్లు, డ్రమ్ములలో దాచి పెట్టిన 1,10,380 లీటర్లు బెల్లం ఊటను ధ్వసం చేసి 160 కేసుల్లో నలుగుర్ని అరెస్టు చేశారు. బెల్టు షాపులపై దాడులు చేసి 78 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా



నర్సీపట్నం సబ్ పరిధిలో సారా బట్టీని స్వాధీనం చేసుకున్న అధికారులు

236.97 లీటర్లు అక్రమ మద్యం సీజ్ చేసి 79 మందిని అరెస్టు చేశారు. ఏజెన్సీ నుంచి నర్సీపట్నం, రోలుగుంట మీదుగా గంజాయి రవాణా అధికంగా జరుగుతుంది. సారా, మద్యం, గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి ఉంటే స్టేషన్‌లో అవసరమైన సిబ్బంది ఉండాలి. గతంలో ఎక్సైజ్ శాఖలో పని చేసే సిబ్బందిని ప్రభుత్వం సెబ్‌కు, ఎక్సైజ్ శాఖ విభాగాలకు సర్దుబాటు చేసింది తప్పితే, కొత్తగా నియామకాలు చేపట్టలేదు.

నాలుగు మండలాలు.. ఏడుగురు సిబ్బంది

నర్సీపట్నం సెబ్ స్టేషన్ పరిధిలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ ఐదుగురు కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు. స్టేషన్‌కి హెడ్ కానిస్టేబుల్ లేరు. ఐదుగురు కానిస్టేబుళ్లలో ఒకరు సెంట్రీ డ్యూటీకి స్టేషన్‌లో ఉండి పోతున్నారు. నాటు సారా, మద్యం కేసులకు ఒకరు, గంజాయి కేసులకు ఒకరు కోర్టు పనులపై తిరగాల్సి వస్తుంది. మిగిలిన ఇద్దరు కానిస్టేబుళ్లు, సీఐ, ఎస్ఐ నాలుగు మండలాల్లో ఇటువంటి నేరాలు అదుపు చేయడానికి పని చేస్తున్నారు. ఎక్సైజ్ స్టేషన్‌గా ఉన్నప్పుడు సీఐ, ముగ్గురు ఎస్ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు, ఒక రైటర్ పని చేసేవారు. ప్రస్తుతం సెబ్ స్టేషన్‌లో సిబ్బంది సరిపోక ఉన్నవారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా గంజాయి, సారా, మద్యం రవాణా చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నారు.



మాకవరపాలెంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ఎండల ధాటికి జనం ఉక్కిరిబిక్కిరి



నాతవరంలో బుధవారం మధ్యాహ్నం ఇదీ పరిస్థితి

బుచ్చెయ్యపేట/గొలుగొండ/మాకవరపాలెం/నాతరవం/మాడుగుల రూరల్, ఏప్రిల్ 24 : భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. పెరుగుతున్న ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గత వారం పదిరోజులుగా ఉదయం తొమ్మిది గంటల నుంచే వేడి వాతావరణం ప్రారంభమవుతోంది. మధ్యాహ్నం పన్నెండు గంటలకు చాలా చోట్ల రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండలకు జడిసి చాలా మంది బయటకు రాలేకపోతున్నారు. తప్పనిసరి స్థితిలో బయటకు వచ్చే వారు సైతం తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బుధవారం బుచ్చెయ్యపేట, గొలుగొండ, మాకవరపాలెం, నాతరవం, మాడుగుల మండలల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

పీటీడీ బస్టాండ్ కిటకిట

- ఓ వైపు సెలవులు..., మరోవైపు మరిడి మహాలక్ష్మి పండగ భక్తుల తాకిడి
- గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూపులు
- నామినేషన్ల కారణంగా ఆలస్యంగా వాహనాల రాకపోకలు



వైజాగ్ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

నర్సీపట్నం, ఏప్రిల్ 24 : ఇక్కడి పీటీడీ బస్టాండ్ బుధవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి ప్రయాణికులు వేచి చూడాల్సి వచ్చింది. ఓ వైపు పాఠశాలలకు వేసవి సెలవులు, మరోవైపు పట్టణంలో జరిగిన మరిడి మహాలక్ష్మి పండగకు వివిధ ప్రాంతాల నుంచి నర్సీపట్నం వచ్చిన వారు ఆది, సోమ, మంగళవారం ఉండి బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. రోజు వారీ ప్రయాణికుల రద్దీతో పాటు పండగ ప్రయాణికులు, విద్యార్థులు తోడవ్వడంతో బస్టాండ్ ప్రాంగణం నిండిపోయింది. తుని, విశాఖపట్నం రూట్లలో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా కనిపించింది. కృష్ణాదేవిపేట రూట్‌లో బస్సులు సరిపోలేదు. రెండు రోజులుగా ఏలేశ్వరం డిపో నుంచి ఆరు బస్సులు నర్సీపట్నం డిపోకి రావడం లేదు. దీని వలన కృష్ణాదేవిపేట, కొయ్యూరు, ఏలేశ్వరం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్‌లో ఉండిపోవల్సి వచ్చింది. నర్సీపట్నం డిపో నుంచి వివిధ ప్రాంతాలకు 96 సర్వీసులను రెగ్యులర్‌గా తిప్పుతున్నారు. అనకాపల్లిలో అభ్యర్థుల నామినేషన్లు ఉండడంతో బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి డిపోకి చేరుకోవడం ఆలస్యమైందని అంటున్నారు. దీంతో అనకాపల్లి, విశాఖపట్నం నాన్‌స్టాప్ బస్సులు అందుబాటులో లేకుండాపోయాయి. విశాఖపట్నానికి ఐదు ప్రత్యేక బస్సులు అదనంగా తిప్పినా సరిపోలేదు. విశాఖపట్నం రూట్లో ఒక బస్సు నిండిపోయి మూడు బస్సు లకు సరిపడా ప్రయాణికులు స్టాండ్‌లోనే ఉండి పోయవల్సి వచ్చింది. నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. ఓ వైపు బస్సులు సకాలంలో లేక ఎండతీవ్రత, ఉక్క పోతతో ప్రయాణికులు అల్లాడిపోయారు.

ఈదురుగాలుల బీభత్సం

... 5వ పేజీ తరువాయి

విరిగి పడ్డాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు గంటల కొద్దీ అంతరా యం కలిగింది.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఠారెత్తించగా, ఆ తరువాత వర్షం కురిసింది. ఈదురుగాలులకు మండలంలోని నాగయ్యపేట, సీతంపేటకు చెందిన పరవాడ లక్ష్మయ్య, గాడి సూర్యనారాయణ, కర్రి అక్కునాయుడు, మరికొంత మంది రైతులకు చెందిన ఆరు ఎకరాల్లోని అరటి తోటలు నేలమట్టమయ్యాయి. చినసోంపురం, శ్రీరాంపురం, దేవరాపల్లి సంతతోట వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



మాడుగులలో వర్షం కురుస్తున్న దృశ్యం

చీడికాడలో..

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటలకు మేఘాలు కమ్ముకొని సాయంత్రం 4 గంటలకు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన జనం వర్షానికి ఊరట చెందారు.

విజయీభవ సందడి

... 5వ పేజీ తరువాయి

అని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిందన్నారు. అనకాపల్లిలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందకుండా పోయాయన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంపీగా అనకాపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి సీహెచ్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన సాగుతోందని, 99 శాతం హామీలు నెరవేర్చామని అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్రంలోని పెద్దలతో మంచి సంబంధాలున్న సీఎం రమేశ్‌ను ఎంపీగా గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి సైకో, దుర్మార్గ పాలనను అంతమొందించాలన్నారు. జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, దేశంలో మోదీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపడితేనే ఆంధ్రా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ర్యాలీలో జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణ, టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత, జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

చోడవరం, ఏప్రిల్ 24 : నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఇందులో భాగంగా చోడవరం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా విప్ కరణం ధర్మశ్రీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ముహూర్తం మేరకు తన భార్యతో కలిసి ఆర్వో కార్యాలయానికి వచ్చిన అయన రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణకు నామినేషన్ పత్రాలను అందించారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుతో పాటు, మాజీ ఎమ్మెల్యే మిలట్రీనాయుడు, నాయకులు శరగడం చిన అప్పలనాయుడు, దొండా రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, డీవీఆర్, ఎంపీపీ గాడి కాసులతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా జగతా శ్రీనివాసరావు మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా సవరాల గణేష్ నామినేషన్ పత్రం సమర్పించారు.

మాడుగుల : మాడుగుల అసెంబ్లీ స్థానానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్‌గా పైలా ప్రసాదరావు తమ నామినేషన్ పత్రాలను ఆర్వో జీవీ సత్యవాణికి అందజేశారు. అదే విధంగా టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణకు డమ్మీగా ఆయన సతీమణి మాధవి నామినేషన్ వేశారు. అదే విధంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కుమారుడు బూడి రవి రెండు సెట్లు, మతల ఆరినాయుడు, మల్లారపు లోవలు స్వతంత్ర్య అభ్యర్థులకుగా నామినేషన్లను ఆర్వోకు అందజేశారు.

నర్సీపట్నం: కాంగ్రెస్ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా రుత్తల శ్రీరామ మూర్తి నామినేషన్ దాఖలు చేశారు. పీసీసీ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న, సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, సీపీఎం నాయకులు అడిగర్ల రాజులతో కలిసి బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి రిటర్నింగ్ అధికారి జయరాంకి రెండు సెట్లు నామినేషన్ పత్రాలు అందజేశారు

చెరువుల్లో చెత్త పారబోతతో చిక్కులు

- ఘాట్‌రోడ్డు జంక్షన్ కాగిత చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు



మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్ కాగిత చెరువు వద్ద పారబోసినవ్యర్థాలు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కొరవడింది. దీంతో ఎక్కడికక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తోంది. కొందరు సామాజిక బాధ్యతను విస్మరించి ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన ఇంట్లో చెత్తను పారబోస్తున్నారు. కొన్నిచోట్ల ఊరిలో సేకరించిన చెత్తను చెరువుల వద్ద, ఏటి ప్రవాహాల్లో గుట్టలుగా వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా జలాల కలుషితంగా మారి మూగజీవాలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. టీడీపీ హయాంలో గ్రామాలను తీర్చిదిద్దేందుకు, పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి సందప కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని ఆ కేంద్రాల్లోకి తరలించేవారు. సంపద కేంద్రాల్లో దానిని ఎరువుగా మార్చి తిరిగి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సదరు పాలకులు సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించలేదన్న ఆరోపణలు వినిపస్తున్నాయి. ఫలితంగా గ్రామాల్లో చాలాచోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని అంటున్నారు. కొందరు మరీ నిర్లక్ష్యంగా చెరువుల వద్ద పారబోస్తుండడం వల్ల ఆయా పరిధిలోని ఆయకట్టు భూముల రైతులు ఆందోళన చెందుతుండగా, పశువులు, పక్షులు వంటివి సైతం ఆ నీటిని తాగలేక పోతున్నాయని అంటున్నారు. ఇదే పరిస్థితి మాడుగుల మండలంలోని ఘాట్‌రోడ్డు సమీపం కాగిత చెరువుల వద్ద కనిపిస్తోంది. ఇప్పటికే చెరువులోని నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఉన్న నీరు కూడా వ్యర్థాలతో కలుషితమవుతోంది. దీంతో ఆ కలుషిత నీటిని తాగిన పశువులు కూడా రోగాలు బారిన పడుతున్నాయని పాడి రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

'కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి'



డి.సురవరంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి బండారు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 24 : కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాడుగుల టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. డి.సురవరం, సాగరం, గొటివాడ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధి కూలీలతోను, ప్రజలతోను మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలంతా చంద్రబాబును ముఖ్యంత్రిగా చేయాలని కోరుకుంటున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజక వర్గ ఇన్‌చార్జ్ పీవీజీకుమార్, పుప్పాల.అప్పలరాజు, జగ్గారావు, బుద్దాలరమ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో పలువురి చేరిక



జనసేనలో చేరిన వారితో పీవీఎస్ఎన్‌రాజు

రావికమతం, ఏప్రిల్ 24 : బుచ్చియ్యపేట మండలం పెదపూడికి చెందిన వైసీపీ నాయకులు దుర్గవరపు రవి, ఉండా తాతారావులు తమ అనుచరగణం 40 మందితో బుధవారం జనసేనలో చేరారు. వీరికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బుచ్చియ్యపేట మండల టీడీపీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళల ఆర్థిక ప్రగతి టీడీపీతోనే సాధ్యం'



సమావేశంలో మాట్లాడుతున్న చింకాయల పద్మావతి

మాకవరపాలెం, ఏప్రిల్ 24 : మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలంటే టీడీపీని గెలుపించుకోవాలని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. మండలంలోని తామరం గ్రామంలో బుధవారం రాత్రి చిరంజీవిరాజు ఇంటి వద్ద నిర్వహించిన మహిళా మేలుకో సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లురామునాయుడులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బస్ స్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్న రాధ

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 24 : ఇక్కడి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బుధవారం చలివేంద్రాన్ని గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ ప్రారంభించారు. సత్యసాయి సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, పాద చారులకు పులిహోర, మజ్జిగను అందజేశారు. సత్యసాయి సేవాదళ్ సభ్యులు పల్లి సత్యనారాయణ, వాసు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలు, వృద్ధులకు వస్త్రదానం



ఏఎల్‌పురంలో నిరుపేద వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 24 : దైవం మనుష్యరూపేణా కార్యక్రమంలో భాగంగా ఏఎల్‌పురంలో సుమారు 20మంది నిరుపేదలు, వృద్ధులకు మంగళవారం రాత్రి వస్త్రాలను పంపిణీ చేశారు. సంతోషిమాత ఆలయం వద్ద పురోహితులు వెలిది సుబ్బారావు, బద్రీ, లచ్చు, వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాలీసెట్ విద్యార్థులకు మాక్ గ్రాండ్ టెస్ట్



మోడల్ టెస్టు నిర్వహిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, ఏప్రిల్ 24 : ఇక్కడి అవంతి కళాశాలలో బుధవారం పాలిటెక్నిక్ మాక్ గ్రాండ్ టెస్టు నిర్వహించారు. పాలీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించేందుకు, భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి 123 మంది విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ప్రసాదరావు, అధ్యాపకులు శివరామ్, ఎస్.ప్రసాదరావు, ఏవో డానియల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగోగాడలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ రేపు

చీడికాడ, ఏప్రిల్ 24 : పెదగోగాడలో నూతనంగా నిర్మించిన కనకమహాలక్ష్మి, నూకాంబిక, మరిడిమాంబ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం జరగనుంది. ఈ సంద్భంగా రెండు రోజులుగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వేదండితుల మంత్రోచ్చారణ నడుమ విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఘనంగా గోసమాంబ ఆలయ ప్రారంభోత్సవం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని లోవ పొన్నవోలు పంచాయతీ కొత్త గదబవీధిలో నూతనంగా నిర్మించిన గోసమాంబ ఆలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, ప్రేమ సమాజం ఆర్క్ ప్రసాద్, పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుపై మురుగు తిష్ఠ

- నర్సింగ్ హాస్టల్‌తో పరిసరాల వారికి ఇబ్బందులు సమస్య
- భవన యజమాని నిర్లక్ష్యమే కారణమని కమిషనర్‌కు ఫిర్యాదు



సీసీ రోడ్డుపైకి వాడుక నీరు చేరడంతో మురుగుగా మారిన దృశ్యం

నర్సీపట్నం, ఏప్రిల్ 24 : మునిసిపాలిటీ పరిధి 28వ వార్డు సీబీఎం కాంపౌండ్ సమీపంలో నివాస భవనాన్ని నర్సింగ్ స్కూల్, హాస్టల్‌కు ఇవ్వడం వల్ల డ్రైనేజీ సమస్య ఏర్పడిందని రిటైర్డు ఎంపీడీవో ప్రేమాకర్ మునిసిపల్ కమిషనర్ రవిబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుమారు రెండు వందల మంది నర్సింగ్ విద్యార్థులు వాడిన నీరుపోయే మార్గం లేక సీసీ రోడ్డు మీదకు విడిచి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. దీంతో రోడ్డుపై మడుగులా తయారై రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇళ్ల ముందు మురుగు పేరుకుపోయి దోమల బెడద అధికమైందన్నారు. ఈ సమస్యపై స్పందించి సంబంధిత భవన యజమాని వాడక నీరు రోడ్డుపైకి చేరకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

అద్దె కార్యకర్తలు

.. 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం వరకు లేదంటే మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ ఉండాల్సి వచ్చినా, ర్యాలీలో తిరగాల్సి వచ్చినా రూ.500 ఇస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఇలాంటి వారికి ఏకంగా రూ.వెయ్యి వరకూ ఇస్తున్నారు. ఒకేసారి అందరికీ అద్దె కార్యకర్తల అవసరం రావడంతో ప్రచారంలో పాల్గొనే కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. కాసేపు కూర్చొని వచ్చేయడం లేదంటే జెండా పట్టుకుని రెండు, మూడు గంటలు నినాదాలు చేయడం చేస్తే రూ.300 నుంచి రూ.500 వరకూ వస్తుండడంతో రాజకీయ కూలీలు కూడా అలాంటి కార్యక్రమాలకు ఆసక్తి చూపుతున్నారు. ఏ పార్టీవాళ్లు పిలిస్తే ఆపార్టీ జెండా పట్టుకుని నినాదాలు చేస్తున్నారు. జనాలను సమీకరించే బాధ్యతను పార్టీ ముఖ్య నేతలు కాకుండా వార్డు స్థాయిలోని చోటా నేతలు, కార్పొరేటర్లకు అప్పగిస్తున్నారు. వార్డు నుంచి ఎంతమందిని తీసుకురావాలని చెబితే అంతమందిని నేతలు తీసుకువెళుతున్నారు. ఇదిలావుండగా నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన తర్వాత రాజకీయ కూలీలకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఒక వైపు ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారానికి, మరోవైపు నామినేషన్ ర్యాలీ/ఊరేగింపులో పాల్గొనేందుకు జనాలను సమీకరించాల్సిన పరిస్థితి. దీంతో ఒకే సమయంలో వేర్వేరు కార్యక్రమాలు ఉండడంతో రాజకీయ కూలీలు ఎటు వెళ్లాలో తేల్చుకోలేని పరిస్థితిలో పడ్డారు. అయితే ఈ పరిస్థితిని కూలీలు కొందరు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకూ ఇస్తున్న రూ.300 అయితే తాము రాలేమని, ఎండలు తీవ్రంగా ఉండడంతో ఇబ్బందిపడాల్సి వస్తోందని, తమకు ఫలానా నియోజకవర్గంలో ఇస్తున్నట్టుగా రూ.వెయ్యి ఇస్తేనే వస్తామంటూ స్పష్టంచేస్తున్నారు. ఒకేసారి అంత మొత్తం పెంచేయడంతో వార్డు స్థాయి నేతలు, కార్పొరేటర్లు విషయాన్ని తమ నేతలకు వివరిస్తున్నారు. ఎన్నికల ఖర్చు పెరిగిపోయిందనే బాధలో ఉన్న తమకు మరింత భారం పెరిగిపోతోం దం టూ లబోదిబోమంటున్నారు. అయినప్పటికీ జన సమీకరణలో వెనుకబడితే ఓటింగ్‌పై ప్రభావం చూపుతుందనే భయంతో వారు అడిగినంత కాకుండా రూ.500 ఇచ్చేందుకు సమ్మతిస్తున్నారు. ఏదిఏమైనా ఎన్నికలు రాజకీయ పార్టీల నేతల తలరాతను ఎలా మార్చుతాయోగానీ, పనుల్లేక ఇబ్బం దిపడుతున్న కూలీలకు మాత్రం ఉపాధి కల్పించాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.